

ఆమె...

చిత్రం— కోటీశ్వరి ( మద్రాసు 61 )

అమ్మా, అన్నపూర్ణా, ఒక ముద్ద అన్నం...'' అడగలేక, అడగలేక ఛిడియపడుతూ ఒక ఇంటి ముందు ఆగినాడు రామస్వామి. జవాబు లేదు.

''అమ్మా, అన్నపూర్ణా ...''

ఇంట్లోనుంచి ఒక వృద్ధురాలు బయటకు వచ్చి, ''పేరుపెట్టి పిలుస్తున్నావు. ఏం, కావరమా?'' అన్నది.

''అన్నం పెట్టేవారంతా అన్నపూర్ణలే నమ్మా'' అన్నాడు.

''భోజనా లింకా కాలేదు. తరవాత రా.''

''ఎప్పుడు రమ్మంటావు, తల్లీ?''

''ఒక అరగంట ఆగి రా.''

ఇక తిరిగే ఓపిక లేక తను ఉంటున్న వసారాలోకి రామస్వామి చేరుకున్నాడు. అరగంట అయిన తరవాత వచ్చి, మళ్ళీ అదే అభ్యర్థన చేసుకొన్నాడు.

''భోజనా లైపోయినాయి. ఏమీ మిగలలేదు. వెళ్ళిరా'' అన్నది.

''నీవు అన్నపూర్ణవని అనుకొన్నా. కాని, సరస్వతిలాగా మాట్లాడుతున్నావు, తల్లీ. వెళ్ళి వస్తా. రేపు దర్శనం చేసుకొంటా, సెలవు.''

''సరస్వతి అన్నావు. అది నా అసలు పేరు. మా అన్న అన్నపూర్ణ అని పిలిచేవాడు. చూస్తే చోద్యంగా ఉంది. ఇంతకీ నీ వసలు ఎవరు?''

''నా కో చెల్లెలు ఉండేది. దాని పేరు అన్నపూర్ణ అని నేనే పెట్టుకొన్నా. కోపగించకమ్మా. ఆకలి బాధతో ఉన్నా. రోజూ ఒక్క ఇంట్లోనే ఒక ముద్ద తింటాను. నువ్వు రమ్మన్నావు, వచ్చాను. ఇప్పుడు పొమ్మన్నావు, పోతున్నా. ఒక్క ముద్ద చాలు ఈ శరీరానికి. రేపైనా పెట్టితే తింటా.''

''ఎన్ని రోజులైంది తినీ?''

''ఈ వేళటికి నాలుగు.''

''ఈ ఊరేనా?''

''కాదు, తల్లీ!''

''నీ గొంతు నాకు తెలిసిందేనే! నీ పేరు?''

''రామస్వామి అని అంటారు.''

''మీది కనగాలా?''

''ఒకప్పుడు.''

''మీ ఇంటి పేరు?''

''చెరుకూరి వారు.''

''అన్నయ్యా, తప్పైపోయింది. నేనే ఆ అన్నపూర్ణని. రా, లోపలికి రా. వంట చేస్తా.''

''వద్దమ్మా, వద్దు. నీవు ఇక్కడ ఉన్నావని తెలిస్తే ఈ ఊరే వచ్చేవాడిని కాదు. నన్ను క్షమించమ్మా.''

''నీ కీ గతి ఎందుకు పట్టింది?''

''దానధర్మాలు చేస్తూ, ఏ పనీ చేయకుండా ఉండటంతో భార్య, పిల్లలు నన్ను బయటకు గెంటేశారు. అంతా కర్మ. రే పోస్తా.''

''కాదు, అన్నయ్యా, నువ్వు ఇక్కడే ఉండిపో.''

''నీకు బరువెందుకమ్మా? గుర్తించావు. ఆదరంగా మాట్లాడావు. అదే నాకు బలం. వస్తా.''

''పిలులేదు. ఉండు.''

బలవంతం చేయటంతో రామస్వామి ఉండిపోయినాడు. కాని, చెల్లెలికి భారం కలిగకూడదని భావించి, ''వీథిబడి పెడితే ఎవరన్నా వస్తారా, అమ్మాయీ?'' అన్నాడు.

''నీ కెందుకు ఈ బాధ కూడాను?''

''కాదులే, విచారించు.''

రెండు రోజుల్లో నలుగురు పిల్లలు తయారైనారు. మొదటి నెల పిల్లకు అయిదు రూపాయలు ఇచ్చేటట్లు, సరిగా చెప్పితే పది అని ఒప్పందం చేసుకున్నారు. రామస్వామి బడిపంతులైనాడు. అంతకు ముందు ఇట్లాగే వచ్చిన బడి పంతులు పిల్లలను చావమోదేవాడు. ఇప్పుడు

## పోతుకూచి

ఈయన దగ్గర బెత్తమే కనిపించదు. పిల్లలకు అర్థం కాలేదు. ఒక రోజున రజని ఆయనదగ్గరకు వచ్చి, ''మాస్టారూ. సీత నా పుస్తకం చించింది'' అని ఫిర్యాదు, చేసింది. సీతను పిలిచాడు. అడిగాడు, సమాధానం సరిగా లేదు.

''చూడు, సీతా, నువ్వు నా పిల్లవు.''

''కాదండీ, మా అమ్మ, నాన్న వేరే ఉన్నారు.''

''ఔను. గురువు కూడా తండ్రే.''

''అయితే?''

''నా పిల్లలు పోట్లాడుకో కూడదు.''

''నేనేం చేయలేదండీ.''

''అయితే, ఎవర్ని ఇంటికి పంపమంటావు?''

''ఎవర్నీ వద్దండీ.''

''సరే, అక్కా చెల్లెళ్ళు లాగా ఉంటారా?''

''ఉంటామండీ.''

ఈ విధంగా సాగిపోతున్నది ఆ బడి. ఒక రోజు సాయంత్రం అన్నపూర్ణతో చెప్పి కాలువదాకా వెళ్ళి తిరుగుముఖంలో ఉన్నాడు రామస్వామి. దారిలో వస్తుండగా ఒక పసిపిల్ల ఏడుపు వినిపించింది. ఏమిటా అని ఆ శబ్దం వస్తున్న దిక్కుగా నడిచాడు. అక్కడ పొత్తిళ్ళలో ఉన్న ఆడపిల్ల కనిపించింది. చుట్టూ తిరిగి కేకలు వేసి, విసిగిపోయి, అన్నపూర్ణ ఇంటికి చేరుకున్నాడు.

''అమ్మాయీ, నా కొక మనమరాలే.''



"మనమరా లేమిటి?"

"దారిలో దొరికిందే."

"ఎవరి పిల్లో?"

"అంతా వెదికా. ఎవరూ కనిపించలే."

"మరేం చేస్తాం?"

"నే పెంచుతానే."

"ఎట్లా?"

"నాకు వచ్చే సలభై నీకే ఇస్తున్నా. ఇక ఈ పిల్లకోసం ఇంకా ప్రయత్నం చేస్తా."

"సరే. ఆ పిల్లకు పాలు?"

రామస్వామి ఆ పిల్ల నెత్తుకొని ఊళ్ళోకి బయలుదేరాడు. పిల్లకు పాలు కావాలని తిరిగాడు. చివరకు ఓ ఇల్లాలు అడిగింది.

"ఎవరి పిల్లను ఎత్తుకొచ్చావు?"

"ఎవరి పిల్లో నాకు తెలియదు. ఆ మహాతల్లి రోడ్డుమీద పారేసిపోయింది. ఎట్లాగైనా పిల్ల బ్రతకాలి అని తెచ్చుకున్నా."

"ఇట్లా చాలా మంది అంటారులే."

అతని అహం దెబ్బ తిన్నది. ఆవిడకు నమస్కారం చేసి బయటపడ్డాడు. ఇంతలో సీత కనిపించింది.

"మాస్టారూ, ఎవరండీ ఈ పిల్ల?"

"నా మనమరాలు."

"ఎప్పుడొచ్చిందీ?"

"ఓ గంట అయింది."

"తల్లి, తండ్రీ?"

"తెలియదు."

"మరి ఎందుకు తిరుగుతున్నారు?"

"పిల్లకు పాలకోసం."

"మా ఇంటికి రండి, నే నిప్పిస్తా."

రామస్వామి పిల్లను తీసుకొని సీత ఇంటికి వెళ్ళాడు. ఆ పిల్ల తల్లి రామ లక్ష్మి ఆదరంగా ఆవుపాలు తెచ్చి ఇచ్చి, రోజూ తీసుకొని వెళ్ళవలసిందని కోరింది. ఆ విధంగా రామస్వామి దగ్గర అయిదవ ఆడపిల్ల తయారైంది. అన్నపూర్ణకు ఏమీ తోచలేదు. కాని, అన్నగారికి కష్టం కలగకూడదని ఊరుకొంది. రామస్వామే ఆ పిల్లకు తల్లి, తండ్రీ అయినాడు.

పిల్ల వచ్చిన వేళ, గొడ్డు వచ్చిన వేళ చూసుకోమంటారు. ఆ పిల్ల వచ్చిన మరు నాటి నుంచి ఏదో ఒక కూరో, కాయో ఆ పిల్లలు తెస్తూ ఉండేవారు. వాటిలో కొంత ధర్మం చేసి, మిగతావి చెల్లెలి కిచ్చే వాడు. ఈ విధంగా రామస్వామి ఆ పిల్లను అయిదేండ్లు పెంచి, శాంతి అని పేరు పెట్టాడు. శాంతి అంటే ఆయన చివరి కూతురి పేరు. శాంతికి ఎవరో ఒకరు గుడ్డలు, రిబ్బన్లు ఇచ్చేవారు. రామస్వామే ఆ పిల్లకు స్నానం చేయిం చటం, గుడ్డలు వేయటం చూచేవాడు. అన్నపూర్ణకు ఇదంతా ఒక చాదస్తంగా కనిపించింది. ఏమీ చేయటానికి పాలు పోలేదు. ఇదంతా రామస్వామి గ్రహించి ఒకనాడు — "అమ్మాయీ, నా పిల్లను తీసుకెళుతున్నాను" అన్నాడు.

"ఎక్కడికి?"

"ఆ పరమేశ్వరుడు చెప్పిన చోటుకి."

పిచ్చి ముదిరిందని ఎంచి మెదలకుండా ఉన్నది. రామస్వామి తన శాంతిని తీసుకొని బయలుదేరాడు. దారిలో రజని, సీత కనిపించారు. రజని అన్నది.

"మాస్టారూ, ఎక్కడికి?"

"ఇంకో ఊరమ్మా."

"మీరు లేకపోతే మాకు పాఠాలు?"

"ఇంకో మాస్టారు వస్తారులే, అమ్మా."

"కాదండీ, మీరే ఉండాలి."

అట్లా సాగింది. రజని బలవంతాన రామస్వామి వాళ్ళ ఇంటికి చేరుకొన్నాడు. అక్కడ వాళ్ళ నాన్న "ఈ బెడద మన కెందుకు" అని అన్నా, రజని మాట తీసి వేయలేక తన ఇంట్లో ఒక గదిని రామ స్వామి కిచ్చాడు. ఆ గదే వంటఇల్లు, పడకగది, బడి. పిల్లలకు బాగా చదువు చెప్తున్నాడని ఇంకా నలుగురు చేరారు: ఇట్లా జీవితం సాగిస్తూ ఉండగా శాంతికి పదేండ్లు వచ్చినవి.

ఒక రోజున "రామస్వామిగారు ఇక్క డేనా ఉండేది? పిల్లలకు పాఠాలు చెబుతా రట" అంటూ వెంకట్రామయ్య దిగి పడ్డాడు. ఆయన అసలు పేరు మాయమై వంతులుగా రనే పేరే అందరకూ తెలిసింది. ఎవరూ సమాధానం ఇవ్వలేదు. చివరకు రామస్వామి పాఠాలు చెపుతున్న వేళకు అక్కడికే చేరుకున్నాడు.

"మీరేనా రామస్వామి గారు?"

"అవును, నాయనా, ఏం కావాలి?"

"నాకు ఎనిమిదేళ్ళ నాడు ఒక పిల్ల పుట్టింది. దానిని వదిలివేశాం. అప్పటి నుంచి పిల్లలు లేరు."

"ఎందుకు వదిలారు?"

"... ..."

"ఎంత ఘోరం చేశావయ్యా!"

"అది గతం. ఇప్పు డనుకొని లాభ మేమిటి?"

"సరే, నాతో పనేమిటి?"

"మీ దగ్గర ఎవరన్నా అనాథ బాలుడు కాని, బాలిక గాని ఉంటే పెంచుకుందామని."

"అలాంటి వారు నా దగ్గర లేరు."

వెంకట్రామయ్య అందరినీ దీక్షగా చూచాడు. చివరకు అతని చూపులు శాంతిమీద నిలిచాయి. ఆ శాంతికి, తన భార్యకు భేదం లేదు. పోలిక లొక్కటే. ఆ పిల్ల నివ్వమని యాచించాడు. రామ స్వామి ఒప్పుకోకపోగా, కసిరి తిట్టి పంపించాడు. నాలుగు ఏళ్ళకు వెంకట్రా మయ్య తన భార్యతో వచ్చి శాంతిని చూపించాడు. దంపతు లిద్దరు శాంతిని పరిశీలించారు. తమ పోలికలే ఆ పిల్లలో ప్రస్ఫుటంగా కనిపించాయి.

"ఎవరు మీరు? ఏం పని మీద వచ్చారు?" అని రామస్వామి అడిగాడు. ఒకరికి ఇంకొకరితో పరిచయమున్నట్లు లేదు. చివరకు వెంకట్రామయ్య భార్య శాంతిని చూపిస్తూ, "ఈ పిల్ల ఎవరు?" అని అడిగింది.

"నా పిల్లే."

"అయితే, మీ భార్య, పిల్లలు?"

"ప్రస్తుతం లేరు."

"ఒక్కరూ ఈ పిల్లను సాకటం కష్టంగా లేదూ?"

"ఒక్క పిల్లను సాకటానికే నాకు కష్టమైతే, ఆ భగవంతు డెలా చేస్తున్నా డమ్మా?"

"మీకు అభ్యంతరం లేకపోతే ఈ పిల్లను తీసుకొని వెళ్ళి పెంచుకుందామని వచ్చాము."

"చాలా సంతోషం. కాని, ఆ పిల్లను ఇవ్వలేను. పాత్తిళ్ళ గుడ్డల్లో ఉండగా తెచ్చి పెంచుకుంటున్నాను. ఆ పిల్ల లేక పోతే బ్రతకలేను. మీకు కావాలంటే చాలా మంది పిల్లలు దొరుకుతారు. దీనిని వదిలి, మీ దారిన మీరు పోతే కృతజ్ఞుడిని."

"ఆ పిల్ల నా పిల్లే నండి."

"అలా అనటానికి ఆధారాలు లేవు. ఒకవేళ ఉన్నా, నీ పిల్లే అయితే ఇన్నేళ్ళూ దానిని ఎందుకు మరిచిపోయావు? ఎలా మరిచిపోయావు? ఒక్క క్షణం దానిని చూసుకోకపోతే నాకే తోచదే. నీ మాట ఎలా నమ్మను? దయచేసి మా జీవితాలని నాశనం చెయ్యకమ్మా, తల్లీ, నమస్కారం"

"మీ దే ఊరండీ?"

"ప్రస్తుతం ఈ ఊరే."

"అసలు ఊరు?"

"మరిచిపోయాను."

"మీ పేరు?"

"రామస్వామి అని అనేవారు."

ఆమె మనస్సు పరిపరి విధాల పోయింది. తన తండ్రి పేరు కూడా అదే. అయితే, ఎన్నో ఏళ్ళ క్రింద చూసింది. పెద్దవాడైనాడు. గుర్తులు కనిపించలేదు.

"ఆ పిల్లపేరు ఏమిటండీ?"

"శాంతి."

"ఆ పేరు ఎందుకు పెట్టారు?"

"నాకు శాంతిని తెచ్చిందమ్మా."

"ఇంకేమైనా కారణం ఉందా?"

"ఉంది. కాని, అవి అన్నీ మీ కెందుకు?"

"మీ అమ్మాయి పేరు శాంతి కదూ?"

అప్పుడు పరీక్షగా చూశాడు. కొద్దిగా జ్ఞాపకాలు వచ్చినాయి. కాని, అనుమానం ఇంకా పీడిస్తున్నది. ఎటూ సమాధానం చెప్పలేకపోయాడు.

"మీ అమ్మాయి పేరే ఈ పిల్లకు పెట్టారు కదూ?" సమాధానం లేదు. చూడబోతే ఈవిడ ప్రవర్తన విచిత్రంగా తోచింది. ఏమీ తేల్చుకోలేకపోయినాడు. చివరకు— "అవును, ఆ పేరుతో ఒక పిల్ల ఉండేది" అన్నాడు.

"మీ భార్య లక్ష్మి కదూ?"

"... ..."

"మీకు ఇద్దరు కొడుకులు ఉండే వారు కాదు?"

"ఉండేవారు."

"మిమ్మల్ని ఇంటినుంచి పంపిం చారా?"

"లేదు."

"అబద్ధం."

"కాదు."

వెంకట్రామయ్య భార్యకి అర్థ మైంది. ఈ రామస్వామి తన తండ్రి కావాలి; లేక తండ్రివంటి వాడు కావాలి అనుకొన్నది.

"నాన్నా!" అని కేకవేసి రామస్వామి కాళ్ళమీద పడ్డది. రామస్వామికి అంతా అయోమయంగా ఉంది.

"నాన్న ఎవరమ్మా?"

"మీరే."

"నేనా?! ఆశ్చర్యంగా ఉందే!"

"నేను శాంతిని, నాన్నా."

"శాంతి అనే పేరు చాలా మంది పెట్టుకుంటా రమ్మా."

"కాదు, నాన్నా, నేను నీ శాంతిని. ఈయన మీ అల్లుడు."

"ఆడపిల్లలంతా నాకు కూతుళ్ళూ మనవరాళ్ళూను. నా అనే వాళ్ళు నాకు ఎవరూ లేరు."

"మేమున్నాం, నాన్నా. ఆ పిల్లను తీసుకొని మా ఇంటికి వచ్చెయి. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాము."

"ఈ అభాగ్యురాలిని పెంచినందుకా?"

"నీ చేతిలో పెరిగింది అభాగ్యురాలు ఎందుకు అవుతుంది, నాన్నా?"

"నన్ను 'నాన్నా' అని పిలుస్తున్నావు. నన్ను మభ్యపెట్టి నా పిల్లను నా నుంచి ఇప్పుడు కూడా వేరుచేయటానికా? వెళ్ళిరా, తల్లీ. నే చనిపోయే ముందు ఈ పిల్లను ఒక అయ్యచేతిలో పెట్టి నిశ్చింతగా బ్రతకనీయండి."

వెంకట్రామయ్యకు ఏమీ తోచలేదు. ఆయన భార్య శాంతికి తల తిరిగి పోయింది. ఈ ముసలాయనతో రాజీ పడటం కష్టమనిపించింది. వెనక్కు తిరి

పోవటానికి కాళ్ళు రాలేదు. పిల్లవైపు తిరిగి, "శాంతీ, నేనే నీ తల్లినమ్మా" అంది శాంతి.

"ఛీ, పో. తాతే నా తండ్రీ, తల్లీ కూడా."

"కాదమ్మా. పాపిష్టిదాన్ని. దుర్బుద్ధి పుట్టి నిన్ను వదిలివేసి పోతే తాత తెచ్చాడమ్మా నిన్ను."

"అయితే, ఆయనే నాకు కావాలి."

"మాతో రావూ?"

"రాను."

"తాతతో కలిసి రా."

"ఆయన్ని నేను తాత అని పిలవ లేదు. ఎప్పుడూ నాన్నా, బాబా అనే పిలుస్తూ వచ్చాను."

"నీకు పెళ్ళి చేయాలి కదా?"

"పుట్టిన వెంటనే తల్లి వదిలివేసిం దంటున్నావు. ఇప్పుడు ఎవరో వచ్చి, నేనే నీ తల్లిని అని చెప్పి, పెళ్ళి చేసి మళ్ళీ వదిలించుకొంటుంది. అంతేగా?"

"మరి తాత నీకు పెళ్ళి చేయడా?"

"చేస్తాడు, కాని, నీతోబాటు ఆయన్ను కూడా తీసుకొని వెళ్ళనిస్తేనే పెళ్ళి చేసు కొంటాను. చిన్నప్పటి నుంచి పాలు పోసి పెంచాడు. ఆయనకు తినటానికి లేక పోయినా, నేను చూడకుండా అన్నం ఉన్నదని మభ్యపెట్టి నాకు పెట్టి, నేను నిద్రపోయిన తరవాత లేచి వెళ్ళేవాడు. ఆయనను వదిలి రాలేను."

"నేనుపాపిష్టిదానిని. క్షమించమ్మా!"

"క్షమించేవాడు తాతే; భగవంతుడు కూడా కాదు."

చివరకు నిరాశ చెందుకొని దంపతు లిద్దరూ తమ ఊరు చేరుకొన్నారు. అక్కడ లక్ష్మి, ఆయన కుమారులకు సంగతంతా చెప్పివేశారు. పిల్లలు పట్టించుకోలేదు. లక్ష్మి కూతుర్ని అడిగింది.

"ఇంకా ధర్మాలు చేస్తున్నారా?"

"ఏడెనిమిది మందికి పాఠాలు చెబు తున్నారు. ఆ పిల్లలే కూరలూ, కాయలూ, పండ్లూ, పాలూ, బియ్యం తెచ్చి ఇస్తున్నారు. అందులో కొంతమందికైనా దానం చెయ్యకుండా శాంతికి కూడా అన్నం పెట్టడు."

"పిల్ల ఎట్లా ఉంది?"

"మనకన్నా చాలా బాగా ఉంది."

"అంటే?"

"కొత్త గుడ్డలు, కొత్త ఫాషన్లు."

"మరి ఆయనో?"

"మామూలే."

"పిల్ల వస్తా ననలేదా?"

"దానిని అపురూపంగా చూసుకొం టున్నాడు. ఆయన లేకపోతే ఆ పిల్ల బ్రతికేటట్లు లేదు. ఆయన విషయం కూడా అంతే."

"మరి పిల్లకు పెళ్ళి చేయరా?"

"ఆయన్ను కూడా రానిచ్చేవానినే పెళ్ళి చేసుకుంటుందట."

"ఇద్దరూ వరిపోయారు."

వెంకట్రామయ్యకు శాంతి దిగులు పట్టింది. పిల్లలు కలగలేదు. రామస్వామి శాంతిని పంపడు—ఏం చెయ్యాలి? ఎన్నో పథకాలు వేసుకొన్నాడు. ఒక్కటీ పనికి వచ్చేటట్లు కనిపించలేదు. వాళ్ళిద్దర్నీ కూడా ఈ ఊరికే రమ్మంటే బాగుం టుందేమో అని భావించాడు. ఇట్లా ఆలోచిస్తూ ఉండగా శాంతికి పదిహే నేళ్ళు వచ్చినాయి. ఒక రోజున బయలు దేరి రామస్వామి దగ్గరకు వెళ్ళి ఈ విషయమే ప్రస్తావించాడు.

"నేను ఆ ఊరు రాను. ఒకసారి నన్ను అక్కడి నుంచి పంపివేసిన వాళ్ళ ముఖాలను చూడదలుచుకోలేదు."

"మా మీద దయ తలచండి."

"నేనేం చెయ్యగలను? పిల్లను అడగండి. అంతా దాని ఇష్టమే."

"అమ్మా, శాంతీ!"

శాంతి వచ్చింది. ముఖం పరిచిత మైనా వెంటనే గుర్తు పట్టలేకపోయింది.

"ఎవరండీ, మీరు? ఎందుకు పిలిచారు?"

"నన్ను మరిచిపోయావా, తల్లీ?"

"... ..."

"నిన్ను, తాతగారిని మా ఊరికి రమ్మని పిలవటానికి వచ్చాను."

"నాన్నగా రేమన్నారు?"

"అంతా నీ ఇష్టమే అన్నారు తాత గారు."

"తాతకాదు, నాన్న."

వెంకట్రామయ్యకు దుఃఖం పొంగి వచ్చింది. తాతను నాన్న అని పిలవటమే బాధ కలిగించింది. కాని, అశక్తుడు. పరిస్థితుల ప్రభావం అది.

"అయితే, ఏమంటావు, తల్లీ?"

"మీరంతా ఎవరో నాకు ఇంత వరకు తెలియదు. మీ రేమో నా తల్లి తండ్రుల మంటున్నారు. ఇలాంటి బంధువులు ఇంకా ఎంతమంది ఉన్నారో? వాళ్ళలో ఒక్కడికి ఆయన సంగతి ఇంత వరకు పట్టలేదు. ఇప్పుడు మటుకు ఎందుకు?"

"పొరబాటు జరిగిందమ్మా."

"అయితే, ఏం చెయ్యమంటారు?"

"మాతో వచ్చి, మా దగ్గరే ఉండండి."

"అది అసంభవం."

"మాతో సంబంధం లేకుండా ఉండే ఒక ఇల్లు మీకు ఇస్తే వస్తారా?"

"మరి మా జీవనోపాధి?"

"మేం చూస్తాము."

"దానికి నాన్న ఒప్పుకోరు. ఆయన ఒప్పుకొన్నా నేను అంగీకరించను. మాకూ ఆత్మ గౌరవ ముంది."

"అయితే, దీని పరిష్కారం?"

"ఆయన పాఠాలు చెపుతారు. నేను స్కూలు ఫైనలు పాసై, ఏవో చిన్న పరీక్షలు కూడా నెగ్గాను. మా ఇద్దరకూ ఉపాధి కలిగించే అవకాశాలుంటే ఆయనను బలవంతం చేయగలను."

"తప్పకుండా రండి. అవన్నీ నేను చూసుకొంటా. మీ ఇద్దరూ నా కళ్ళ ఎదట ఉంటే అంతే చాలు."

వెంకట్రామయ్య కనగాలకు వెళ్ళి, ఏర్పాట్లు అన్నీ చేసి తిరిగి వచ్చాడు. ఇంతలో రజని అన్నయ్య ఆ ఊరికి రావటం జరిగింది. శాంతిని చూచి, ఆ పిల్లనే పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించు కొన్నాడు. తల్లిదండ్రులు అభ్యంతరం పెట్టినా అతను వినిపించుకోలేదు. చివ రకు వాళ్ళు అంగీకరించక తప్పలేదు. కృష్ణా రావు ఒక రోజున తన కొడుకు పశిన్ కాంత్‌ని వెంటబెట్టుకొని రామస్వామి దగ్గరకు వచ్చి ప్రస్తావన తీసుకొని రావటం జరిగింది.

"మా పిల్లవాడికి మీ అమ్మాయి నచ్చింది. వివాహం చేసుకోవాలని అను కొంటున్నాడు. మీ అభిప్రాయం?"

"నా దేముందండీ? ఉభయులకు ఇష్టమైతే పెళ్ళి జరిపించటం మంచిది. కాని ..."

"మీ సందేహ మేమిటి?"

"ఏమీ లేదు. కట్నం కానుకలను ఇవ్వ గల స్థితిలో లేను. అదే నాకు ఆందోళన కలిగిస్తున్నది."

"మీ కా భయం అక్కరలేదు. వాటితో మాకు ఎలాంటి సంబంధమూ లేదు."

"నాకుమాత్రం మా తండ్రి చేయిం చిన బంగారు మొలత్రాడు ఉన్నది. దానిని కరిగించి ఆ బంగారాన్ని పిల్లకు ఇస్తాను. పై ఖర్చులు నా చేత కావేమో?"

"మీకు పెద్ద పలుకుబడి ఉన్నది కనక ఖర్చుల విషయం చూడ నక్కర లేదు. ముహూర్తం పెట్టించండి."

ముహూర్తం పెట్టించారు. పెళ్ళికి రామస్వామి పిల్లలు, భార్య వచ్చారు. వెంకట్రామయ్య, అతని భార్య కూడా చేరుకొన్నారు. కాని, కన్యాదానానికి రామస్వామి మాత్రమే కూర్చోవాలని శాంతి, కృష్ణారావు పట్టు పట్టడంతో ఆయనే కన్యాదానం చేయవలసి వచ్చింది. తన భార్య అక్కడేఉన్నా, ఆమెను కూర్చో నీయకుండా, ఒక రవికను బొడ్లో ఉంచుకొని కన్యాదానం చేశాడు. ఆయన భార్యను, పిల్లలను ఇది అంతా కల్లోలం పరిచింది. ఫలితం— రామస్వామి తన ఊరు వెళ్ళలేదు. అక్కడే శాంతిని చూసుకొంటూ, పిల్లలకు చదువు చెప్పుతూ కాలక్షేపం చేస్తున్నాడు. ఇంతలో ఒక ఏడాది తిరిగింది. శాంతి పండువంటి మగ శిశువును కన్నది. వేడుకలన్నీ సక్రమంగా జరిగినవి. బారసాల నాడు "శాంతీ!" అని పెద్ద కేక వినిపిం చింది. 'ఏమిటి' అంటూ అందరూ మూగారు. చివరకు శాంతి వచ్చింది. పిల్ల చేతిని తన చేతిలోకి తీసుకొంటూ, ఇంకో చేత్తో పిల్లను ఆశీర్వదిస్తూ, రామస్వామి కళ్ళు తృప్తిగా మూతలు పడ్డవి.

*

### యాత్ర

నాకు రచయిత అనిపించుకొనడం కన్న జర్నలిస్టు అనిపించుకొనడం చాల ఇష్టం జర్నలిస్టు అనేవాడు మహా యాత్రికుడు.

—జి. కె. చెస్టర్‌టన్

వైద్య విద్యార్థికి ఆస్పత్రి ఎలాంటిదో కొత్త రచయితకు పత్రికలు అలాంటివి.

—జి. హెచ్. లోరిమర్

### నీడ

మనం జీవిస్తున్నది ప్రభుత్వం నీడన – పత్రికల నీడన.

—వెండర్ ఫిలిప్స్